ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
శుక్రవారం 5 జులై 2024



సమస్యల ఫుల్



శిథిలావస్థకు చేరుకున్న నెల్లికుదురు గ్రంథాలయ భవనం



గూడూరులో అద్దె భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయం

- శిథిలమైన భవనాల్లో కొనసాగుతున్న విజ్ఞాన భాండాగారాలు
- జిల్లాలో 14 గ్రంథాలయాలు, నలుగురే రెగ్యులర్ ఉద్యోగులు
- 1987 నుంచి శాఖలో నియామకాలు కరువు
- లైబ్రరీల అభివృద్ధికి పాలకులు కృషి చేయాలంటున్న పాఠకులు

మహబూబాబాద్ టౌన్, జూలై 4 : విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. సౌకర్యాలు లేక పాఠకులు ఇబ్బందిపడుతున్నారు. మహబూబాబాద్ జిల్లాలో కొన్నిచోట్ల సొంతభవనాలు ఉండగా, మరికొన్ని ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరాయి. వర్షంవస్తే ఎప్పుడు కూలుతాయోనని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. నాటి స్వాతంత్ర్య ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించిన లైబ్రరీలపై పాలకులు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారు. ఎంతో మందికి విజ్ఞానాన్ని అందించడంతో పాటు అనేక మంది గ్రంథాయాలల్లో విద్య సముపార్జించి ఉద్యోగులుగా ఎదిగారు. అంతటి విజ్ఞాన భాండగారాలు మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదు. గూడూరు, కురవి గ్రంథాయాలు మాత్రం అద్దె భవనాల్లోనే నేటికి కొనసాగుతున్నాయి. గ్రంథాలయ శాఖకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోవడంతో ఎక్కడా వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉందనడంలో అతిశయోక్తి లేదు. ఇటీవల రాష్ట్ర గ్రంథాయ చైర్మన్‌గా నియామకమైన రియాజ్ మానుకోట వాసి కావడంతో మహబూబా బాద్ జిల్లాలోని గ్రంథాలయాలకు మహర్దశ పట్టనుందని పాఠకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

శిథిలమైన భవనాల్లోనే కొనసాగింపు..

మానుకోట పట్టణంలో కేంద్ర గ్రంథాలయంతో పాటు జిల్లాలో 11 శాఖ లైబ్రరీలు, 2 గ్రామీణ గ్రంథాలయాలు ఉన్నాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపుడి నవీన్‌రావు చొరవతో జిల్లాకేంద్రంలో అన్ని హంగులతో గ్రంథాలయ భవనాన్ని నిర్మించారు. నిరుద్యోగులు చదువుకునేందుకు వీలుగా అన్నివసతులు కల్పించారు. ఇక్కడ మాత్రం రోజుకు 350 నుంచి 400 మంది గ్రంథాలయానికి వచ్చి పుస్తకపఠనం చేస్తున్నారు. జిల్లాలోని ఇనుగుర్తి, కేసముద్రం, నెల్లికుదురు, మరిపెడ, బయ్యారం, గార్ల, డోర్నకల్, దంతాలపల్లి, తొర్రూరు, గూడూరు, కొత్తగూడల్లో శాఖ గ్రంథాయాలు, కురవి, రాజోలులో గ్రామీణ గ్రంథాలయాలున్నాయి. ఇందులో గూడూరుశాఖ గ్రంథాలయంతో పాటు కురవి గ్రామీణ గ్రంథాయలం అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మిగతా వాటికి సొంత భవనాలున్నప్పటికి అవి శిథిలావస్థకు చేరుకుని ఎప్పుడు కూలుతాయనన్నట్లు ఉన్నాయి. కొన్ని గ్రంథాలయాల భవనాలు వర్షం వస్తే కురుస్తున్నాయి. కురవి గ్రంథాయాలనికి స్థలం కేటాయించి రూ.10 లక్షల నిధులు మంజూరి అయినప్పటికి భవన నిర్మాణం చేపట్టలేక పోయారు. ఈ విషయంలో స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వవిప్ రాంచంద్రునాయక్ చొరవ చూపి గ్రంథాలయానికి నూతన భవనాన్ని నిర్మించే విధంగా కృషి చేయాలని కోరుతున్నారు.



కేసముద్రంలో పురాతన భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయం

సిబ్బంది అంతంతే !

మహబూబాబాద్ జిల్లాలో గ్రంథాలయాలను సిబ్బంది కొరత వేధిస్తోంది. ఎక్కడా సరిపడ సిబ్బంది లేకపోవడంతో గ్రంథాలయల నిర్వహణలో ఇబ్బందులు తప్పడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా 571 గ్రంథాలయాలు ఉంటే అందులో 1039 మంది ఉద్యోగులు పని చేస్తుంటే రెగ్యలర్ ఉద్యోగులు కేవలం 387 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. మానుకోట పట్టణంలో జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు జిల్లాలో 11 శాఖ గ్రంథాయాలు, 2 గ్రామీణ గ్రంథాలయలుండగా కేవలం నలుగురే రెగ్యులర్ ఉద్యోగులున్నారు. ఇద్దరు గ్రేడ్-3 లైబ్రేరియన్‌లు, ఒక్క రికార్డు అసిస్టెంట్, ఒక్క అటెండర్ మాత్రమే ఉన్నారు. ఇందులో ఒక్కగ్రేడ్ -3 లైబ్రేరీయన్, రికార్డు అసిస్టెంట్ జిల్లా కేంద్రగ్రంథాయలంలో విధులు నిర్వర్తిస్తున్నారు. మరో గ్రేడ్-3 లైబ్రేరియన్ బయ్యారం, మరిపెడ గ్రంథాలయ ఇన్‌చార్జ్ లైబ్రేరీయన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక ఉన్న ఒక్క అటెండర్ డోర్నకల్, గార్ల గ్రంథాయాలల్లో పని చేస్తున్నారు. తాత్కాలిక పద్ధతిలో నియామకమైన ఉద్యోగులతో గ్రంథాయాల నిర్వహణ కొనసాగుతోంది. 1987 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో గ్రంథాలయాల శాఖలో ఉద్యోగ నియామకాలు జరగలేదు. అంతకు పూర్వం నియామకమైన వారు ఒక్కొక్కరు పదవీ విరమణ పొందుతుండగా గ్రంథాలయాలకు ఉద్యోగులు, సిబ్బంది కొరత ఏర్పడుతోంది. విద్య సముపార్జనకు నిలయాలుగా ఉన్న గ్రంథాలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని పాఠకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గ్రంథాలయానికి నూతన భవనాన్ని నిర్మించాలి

- గార అనిల్, నెల్లికుదురు



నెల్లికుదురులో శిథిలావస్థకు చేరుకున్న గ్రంథాలయ భవనంలో పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పుస్తకపఠనం చేసే సమయంలో ఎప్పుడు కూలుతుందోనన్న భయాందోళన చెందుతున్నారు. గ్రామ పంచాయతీ స్థలం చూపించకపోవడంతో భవనాన్ని నిర్మించలేక పోతున్నారు. ఇప్పటికైనా స్థలాన్ని సేకరించి అన్ని హంగులతో విశాలమైన ప్రదేశంలో పాఠకులకు అనూకూలంగా ఉండే విధంగా గ్రంథాలయ భవనాన్ని నిర్మించాలి.

గ్రంథాలయానికి భవనం నిర్మించాలి

గట్టు గణేష్, అయోధ్యపురం, గూడూరు మండలం



గూడూరు మండల కేంద్రంలో గ్రంథాలయానికి సొంత భవనం లేకపోవడంతో అద్దె భవనంలో కొనసాగుతోంది. అరకొర వసతుల నడుమ పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. గూడూరులో గ్రంథాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించి నిధులు మంజూరు చేసి నూతన భవనాన్ని నిర్మించాలి. ప్రజాప్రతినిదులు చొరవ చూపాలి.



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

ప్రభుత్వ లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

- అధికారులు, బ్యాంకర్లు సమష్టిగా పని చేయాలి
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ లక్ష్యాల సాధనకు అధికారులు, బ్యాంకర్లు కృషి చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం బ్యాంకర్లు, అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాల సాధనకు సమిష్టిగా పని చేయాలని, తద్వారా క్షేత్రస్థాయిలో సంబంధిత లబ్ధిదారులకు మేలు జరుగుతుందన్నారు. రైతులకు రుణాల పంపిణీ, స్వయం సహాయక సంఘాలు, స్వశక్తి సంఘాల రుణాల రికవరీలు సకాలంలో చేయాలన్నారు. 2024-25 సంవత్సరానికి జిల్లా రుణాల లక్ష్యం రూ.4,581 కోట్లు, పంట రుణలక్ష్యం రూ.1,847 కోట్లు అని చెప్పారు అనంతరం బ్యాంకర్ల వారీగా వివిధ శాఖల ద్వారా అందిస్తున్న రుణాల మంజూరు, లక్ష్యాలపై సమీక్షించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం అన్ని బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు పక్కాగా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. సమావేశంలో నాబర్డు ఏజీఎం చంద్రశేఖర్, ఆర్బీఐ ప్రతినిధి డియోజిత్ భర్వ, ఉద్యానవన శాఖ అధికారి మరియన్న, బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాను హరితవనంగా మార్చాలి..

మొక్కలు విరివిగా నాటి, వాటిని సంరక్షించి జిల్లాను హరితవనంగా మార్చా లని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం వనమహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వనమ హోత్సవాన్ని జిల్లాలో వందశాతం లక్ష్యాలను పూర్తి చేసేందుకు శాఖలవారీగా ప్రణాళికలు రూపొందించి మొక్కలు నాటే ప్రదేశాలను గుర్తించాలన్నారు. ప్లాం టేషన్ పూర్తయిన తర్వాత నాటిన మొక్కల పూర్తి వివరాలను పోర్టల్‌లో అప్ లోడ్ చేయాలని సూచించారు. జిల్లాలో అన్నిశాఖలు, మునిసిపాలిటీ పరిధిల్లో కలిపి 46.75 లక్షల మొక్కలను నాటే విధంగా లక్ష్యం ఉందన్నారు. ఈ సమా వేశంలో అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, ఎం. డేవిడ్, డీఎఫ్‌వో బత్తుల విశాల్ పాల్గొన్నారు.

సేవచేసిన వారికే మంచి గుర్తింపు

- ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



ఎంపీపీ దంపతులను సన్మానిస్తున్న రాంచంద్రునాయక్

దంతాలపల్లి, జూలై 4 : సమాజ సేవతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజాప్రతినిధిగా అందుబాటులో ఉన్న వారికే గుర్తింపు చిరకాలం ఉంటుందని ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. గురువారం గున్నేపల్లి రైతు వేదికలో జరిగిన పదవీకాలం పూర్తి చేసుకున్న జిల్లా పరిషత్ సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షురాలు, మండల పరిషత్ సభ్యులకు వీడ్కోలు సభలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి అతీతంగా గ్రామాలఅభివృద్ధికి నాయకులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొనాలన్నారు. ఎంపీపీ ఉమామల్లారెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ యాకయ్య, హంజీభద్రూనాయక్, దుబాకుల వెంకన్న, రాధిక, సతీష్, ఎంపీడీవో వివేక్రమ్, ఎంపీవో అప్సర పాషా, నాయకులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- వరద ముంపు నుంచి నగరానికి విముక్తి కల్పిస్తాం
- యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపడతాం
- వీలైనంత త్వరగా 2050 మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తాం
- సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి
- ఈ ఏడాది నుంచే నర్సంపేట మెడికల్ కాలేజీలో తరగతుల నిర్వహణ
- సీజనల్ వ్యాధులపై వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలి
- సెప్టెంబరు 9వ తేదీలోపు కాళోజీ కళాక్షేత్రం పనులు పూర్తి చేయాలి
- ఉమ్మడి వరంగల్ అభివృద్ధి సమీక్షలో ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

6లో..



హైదరాబాద్ సచివాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రులు, పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు

మానుకోట అభివృద్ధికి ఐక్యంగా పని చేద్దాం

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



మహబూబాబాద్ బీఎన్ గుప్తా కాలనీ వద్ద సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, జూలై 4 : మానుకోట పట్టణాభివృద్ధికి పార్టీల కతీతంగా అంతా కలిసికట్టుగా పని చేద్దామని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ మునిసిపల్ 22వ వార్డు కంకర బోడులో రూ.10 లక్షలతో నిర్మించతలపెట్టిన సీసీరోడ్డు, 36వ వార్డు పరిధిలో బీఎస్.గుప్తా కాలనీ వద్ద రూ.10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలోనే రాజకీయాలని ఆ తర్వాత అంతా ఐక్యంగా అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలన్నారు. తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించి అసెంబ్లీకి పంపించిన ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా పని చేస్తానని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రగతే లక్ష్యంగా పని చేస్తూ తెలంగాణలో మానుకోటను రోల్ మోడల్‌గా నిలిపేందుకు శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. అనంతరం రామాస్ ఉర్దూమీడియం స్కూల్, బీఎస్ఎన్ఎల్, మునిసిపల్ క్వార్టర్స్‌లను సందర్శించారు. కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, కమిషనర్ నోముల రవీందర్, డీఈ ఉపేందర్, ఏఈ సురేష్, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, వార్డు కౌన్సిలర్ బి.నీరజ, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథి, పెరుగుకుమార్, ఖలీల్‌పాష, చింతకుంట్ల వెంకన్న, సాంబలక్ష్మి, మేక వీరన్న, రవి, బోసు, రమేష్, నాగేశ్వర్‌రావు, ఉమాకర్, శ్రీనివాస్, చరణ్, నవీన్, ప్రవీణ్, మాదరబోయిన యాకయ్య, ఐలేష్, అశోక్, వెంకట్‌రెడ్డి , ఎక్బాల్, అక్రమ్, రియాజ్ పాల్గొన్నారు.

మునిసిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తా

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



మాట్లాడుతున్న యశస్విని రెడ్డి

తొర్రూరు, జూలై 4 : తొర్రూరు మునిసిపాలిటీ అభివృద్ధికి అన్నివిధాల కృషి చేస్తానని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. గురువారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో చైర్మన్ రాంచంద్రయ్య అధ్యక్షతన నిర్వహించిన పాలకవర్గ సమావేశానికి ఆమె హాజరై మాట్లా డుతుండగా, మూడేళ్లగా పనులు చేస్తున్నా ఏఈ నిర్లక్ష్యంతో బిల్లులు రావడంలేదని, పనులు చేసిన కాంట్రాక్టర్‌లు నిరసన తెలిపారు. బిల్లుల చెల్లింపులో జాప్యం ఎందుకు జరుగుతుందని ఎమ్మెల్యే ప్రశ్నించగా, అధికారులు సమాధానం చెప్పలేకపోయారు. సంబంధిత మునిసిపల్ కమిషనర్ విచారణ చేపట్టాలన్నారు. మునిసిపాలిటీకి శానిటేషన్ సిబ్బంది లేకపోవడం వల్ల చెత్తతరలింపు, డ్రైనేజీ తదితర ఇబ్బందులు, వార్డుల్లో సీసీ రోడ్లు, పెద్ద చెరువు మినీ ట్యాంక్‌బండ్, డివైడర్ వెడల్పు తదితర పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన అమృత్ తాగునీటి పథకం మునిసిపాలిటీలో అమలు చేసేందుకు కృషి చేయాలని కౌన్సిలర్‌లు కోరారు. పట్టణంలో సీసీ రోడ్ల పనులు చేస్తున్న కాంట్రాక్టర్ ఎస్‌కేఆర్‌సీ సిబ్బంది పనులు వేగవంతం చేయాలని, మునిసిపాలిటీలో ఎలక్షన్ కోడ్ ముగిసిన తర్వాత రూ.62 కోట్ల పనులకు టెండర్లు ప్రారంభమయ్యాయని, పట్టణంలో అభివృద్ధి పనులు చేస్తామన్నారు. మునిసిపాలిటీ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని తెలిపారు. మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు, కమిషనర్ శాంతికుమార్, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కృషి చేస్తాం..

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అన్నివిధాలుగా కృషి చేస్తుందని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. తొర్రూరులోని రైతు వేదిక వద్ద పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతుబంధు, రైతుభరోసా పథకంపై నిర్వహించిన అవగాహన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వంలో రైతుబంధు నిధులు వేలకోట్లు రూపాయలు వృథాగా పోయాయని, ప్రభుత్వం అర్హులైన రైతులకే అందించాలని సమావేశాలు ఏర్పాటు చేస్తోందన్నారు. రైతులందరికీ రైతుభరోసా అందుతుందన్నారు. కాగా, రైతుల సలహాలు వినేందుకు వచ్చిన ఎమ్మెల్యే వారి మాటలు వినకుండానే వెళ్లిపోయారు. పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, జడ్పీటీసీ శ్రీనివాస్, సొసైటీ పాలకవర్గ సభ్యులు, జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యు, ఏడీఏ మురళీమోహన్, ఏవోలు, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన ఉండాలి

ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్



నూతన చట్టాల పుస్తకాలను అధికారులకు అందజేస్తున్నసుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, జూలై 4 : మూడు కొత్తక్రిమినల్ చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం చట్టాలపై పోలీస్ అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి వచ్చిన 30 పుస్తకాలను అధికారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తచట్టాల గురించి పౌరులకు మార్గనిర్దేశం చేసేందుకు జిల్లా పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసిజర్‌పై సమగ్ర బుక్‌లెట్ ఉంటుందన్నారు. ఈ కొత్త విధానపరమైన చట్టం క్రిందచాలా ముఖ్యమైన విషయాలను కవర్ చేస్తుందన్నారు. దర్యాప్తు అధికారులు ఒకేరకమైన విధానాలను పాటించేందుకు స్పష్టత ఉంటుందన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ అధికారులకు కొత్తచట్టంకు సంబంధించిన పుస్తకాన్ని అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఏఎస్పీ జోగుల చెన్నయ్య, ఏఆర్‌డీఎస్పీ విజయప్రతాప్, ఆర్‌ఐలు భాస్కర్, సాంబశివరావు, సోములు, అనిల్, డీసీఆర్బీ సీఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

విషాదం మిగిల్చిన పుట్టినరోజు వేడుక

- విందులో తాటికల్లు తాగిన ముగ్గురు యువకులకు అస్వస్థత
- హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి
- మరొకరి పరిస్థితి విషమం
- రామన్నగూడెంలో జూన్ 10న ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి.. ఘటనపై వ్యక్తమవుతున్న అనుమానాలు





బోగోజి శ్రావణ్, ఎస్‌కే రహీమ్‌పాష (ఫైల్)

నర్సింహులపేట, జూలై 4 : స్నేహితుల పుట్టినరోజు వేడుక ఇద్దరు యువకుల కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. బర్త్‌డే పార్టీ పేరుతో తాటికల్లు తాగిన ముగ్గురు యువకులు అస్వస్థతకు గురై, హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు. మరొకరు ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. గతనెల 10న నర్సింహులపేట మండలం రామన్నగూడెంలో జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నర్సింహులపేట ఎస్‌ఐ జి.సతీష్ గ్రామస్థుల తెలిపిన వివరాల ప్రకారం.

నర్సింహులపేట మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన దొంతు విజయ్, గొడిశాల మనోజ్, బోగోజి శ్రావణ్ (26), ఎస్‌కే రహీంపాష (25), ఉపేంద్రాచారి వీరంతా స్నేహితులు. శ్రావణ్ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఓ బిల్డర్ వద్ద సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. ఎస్‌కే రహీంపాష ఐదేళ్ల నుంచి రామన్నగూడెం గ్రామ పంచాయతీలో కారోబార్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఉపేంద్రచారి గ్రామంలో ఫర్నిచర్ పని చేస్తున్నాడు. జూన్ 10వ తేదీన తమ స్నేహితులైన దొంతు విజయ్, గొడిశాల మనోజ్ పుట్టినరోజు కావడంతో ఆ రోజు సాయంత్రం వీరితో పాటు మరో 12 మంది యువకులంతా కలిసి ఊరి చివరన తమ స్నేహితులతో కేక్ కట్‌చేయించి వేడుకలను జరుపుకొన్నారు. అనంతరం చికెన్‌తో విందు ఏర్పాటు చేసుకున్నారు. వీరిలో కొందరు మద్యం తాగారు. అలాగే

మిగతా 8వ పేజీలో..

రక్త పరీక్షల్లో మిథైల్ ఆల్కాహాల్.. విషప్రయోగంపై అనుమానాలు..

పుట్టినరోజు విందుకు తీసుకువచ్చిన తాటికల్లు తాగి అస్వస్తతకు గురైన ముగ్గురు శ్రావణ్, రహీమ్‌పాష, ఉపేంద్రాచారి రక్త పరీక్షల్లో మిథైల్ ఆల్కాహాల్ ఉన్నట్లు ఖమ్మం వైద్యులు నిర్ధారించగా.. హైదరాబాద్‌లో సైతం అదే రిపోర్టు రావడంపై కల్లులోనే ప్రాణాంతకరమైన మందులు కలిపి ఉండవచ్చని బాధిత కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఘటనపై గ్రామస్థులతో పాటు కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వేడుకలో పాల్గొన్న కొందరు స్నేహితులే ఆ ముగ్గురుపై విషప్రయోగం చేసి, ఉండవచ్చనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో ఉన్న యువకులు రెండు గ్రూపులుగా విడిపోయారని, కొందరి మధ్య ఆధిపత్య పోరు సాగుతోందని, ఈ క్రమంలో వారిలోనే కొందరు ఆ ముగ్గురిపై విషప్రయోగం చేసిఉండొచ్చన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.



ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ఉమ్మడి వరంగల్ అభివృద్ధి సమీక్షలో ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి


సమీక్షలో మాట్లాడుతున్న మంత్రులు, పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు

వరంగల్, జూలై 4(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్): ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌరసంబధాల శాఖ మంత్రి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ సచివాలయంలోని తన కార్యాలయంలో గురువారం ఆయన ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఆయా జిల్లాల కలెక్టర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కార్యచరణ రూపొందిస్తోందన్నారు. 2050 నాటికి జనాభా పెరుగుదలకు అనుగుణంగా వరంగల్ నగర అవసరాలకు సరిపోయేలా మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ మాస్టర్ ప్లాన్‌లో ఫార్మా సిటీ, ఐటీ సర్వీసెస్, మాన్యుఫ్యాక్షరింగ్ యూనిట్స్, ఏకో టూరిజం, ఎడ్యుకేషనల్ సంస్థలు, స్టేడియం, ఎయిర్‌పోర్టు, లాజిస్టిక్స్ పార్కు, టూరిజం, ఖమ్మం-వరంగల్ రహదారిలో, కరీంనగర్- వరంగల్ రహదారిలో డంపింగ్ యార్డుల ఏర్పాటు లాంటి అంశాలు ప్రధానంగా ఉండేలా మాస్టర్ ప్లాన్‌ను వీలైనంత త్వరగా తయారు చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రతీ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌లను త్వరితగతిన తయారు చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు పనులు పూర్తి చేయలేకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. వరంగల్ నగరంలో నిర్మించే రింగ్‌రోడ్డు జాతీయ రహదారులకు కనెక్టివిటీ ఉండేలా చూడాలని కోరారు. అలాగే ఈ ప్రాజెక్టులకు భూసేకరణ యుద్ధప్రతిపాదికన చేపట్టాలని కోరారు. వరంగల్ నగరంలో నిర్మిస్తున్న కాళోజీ కళాక్షేత్రాన్ని సెప్టెంబరు 9న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని, ఆలోపు పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నర్సంపేట మెడికల్ కాలేజీలో ఈ ఏడాది నుంచే తరగతులు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని వైద్యా, ఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా చొంగ్తుని ఆదేశించిన ఆయన వరంగల్ సూపర్‌స్పెషాలిటీ అస్పత్రిని త్వరగా పూర్తి చేయాలని, దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కాజీపేట, అయోధ్యపురం ఆర్‌ఓబీ నిర్మాణం పనులు ఆలస్యంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏళ్లు గడుస్తున్నా ఇంకా డ్రాయింగ్ల దగ్గరే ఉండటమేంటని అగ్రహం వ్యక్తం చేశారు. వరంగల్ నగరానికి వరద నుంచి విముక్తి కల్పించేందుకు దృష్టి పెట్టామన్నారు. నాలాలు, చెరువులు ఆక్రమణకు గురికావటం వల్లే తరుచుగా వరంగల్ నగరం వరద ముంపునకు గురవుతోందని, ఈ నాలాల ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. నాలాలను అక్రమించుకుని ఇళ్లు నిర్మించుకున్న వారిని గుర్తించి వారిని తక్షణమే ఇతర ప్రాంతాలకు తరలించాలని సూచించారు. అయితే మానవతా దృక్పథంతో వ్యవహరించి పేదవారికి ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అధికారులకు సూచించారు. వరద నీరు సాఫీగా వెళ్లడానికి నలాలను విస్తరించాలని, ఇందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) బలోపేతం చేయాలని, ఇందుకు అవసరమైన సిబ్బందిని రెవెన్యూశాఖ నుంచి సమకూరుస్తామని మంత్రి తెలిపారు. వర్షాకాలం ప్రారంభమవడంతో ఉమ్మడి వరంగల్‌జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్యులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. గ్రామీణ పేదలకు ప్రభుత్వం వైద్యం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వరంగల్ ఎంజీఎంలో గతంకంటే మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు వైద్యాధికారులు దృష్టిపెట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కోరారు.

భూసేకరణ వేగవంతం చేయాలి

ఇన్నర్ రింగ్‌రోడ్, ఔటర్ రింగ్ రోడ్డు పనులు వేగవంతం చేయాలని అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ కోరారు. ఈ రోడ్ల కోసం చేపట్టే భూసేకరణలో ఇళ్లు కోల్పోయినవారికి ఇళ్లు, భూమి కోల్పోయిన వారికి భూమిని అందించే దిశగా కార్యాచరణ అమలు చేయాలని ఆదికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవల్సిన అవసరం లేకుండా రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే గడువులోపు ఓఆర్ఆర్, ఐఆర్ఆర్ ఫేజ్-1 పనులు పూర్తి చేస్తూనే, ఫేజ్-2 పనులకు నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. మాస్టర్ ప్లాన్‌కు ఇబ్బంది రాకుండా ఆర్‌వోబీలు, ఆర్‌యూబీ నిర్మాణం చేపట్టాలని సురేఖ ఆదేశించారు. వర్షాకాలం కావడంతో నగరంలో వరద సమస్యను రెస్క్యూ టీమ్‌లను సన్నద్ధం చేయాలన్నారు. ఎంజీఎంలో పనిచేసే జూనియర్ డాక్టర్లకు కేటాయించిన హాస్టల్ దుస్థితిపై అధికారులు మంత్రికి వివరించగా, వారి నివాసానికి సాధ్యమైనంత త్వరగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎంజీఎంలో కిడ్నీ వ్యాధిగ్రస్థులకు అందుబాటులో ఉన్న డయాలసిస్ యూనిట్లను మెరుగు పర్చాలని ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్‌ను ఆదేశించారు. జక్కలొద్దిలో ఆక్రమణకు గురైన ప్రభుత్వం భూములను స్వాధీనం చేసుకోవాలని, నగరాభివద్ధిని దృష్టిలో పెట్టుకుని కూడా పరిధిని విస్తరించాలని మంత్రి కొండాసురేఖ సూచించారు.

దేవునూరును పర్యాటక కేంద్రంగా చేయాలి

స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలోని దేవునూరు గుట్టలను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. దేవునూరు ఇనుపరాతి గుట్టల్లో రోప్‌వే, ట్రెక్కింగ్, క్యాంపింగ్ సదుపాయాలు కల్పించాలని కోరారు. ధర్మసాగర్ బండ్‌ను ఆధునికీకరించాలని, రిజర్వాయర్‌లో వాటర్‌స్పోర్ట్స్ ఏర్పాటు చేయాలని కడియం కోరారు. ఈ సమీక్షలో రాష్ట్ర గిరిజనాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, సీఎం ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి, కేఆర్.నాగరాజు, ఎమ్మెల్సీలు బండా ప్రకాష్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజు సారయ్య, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్యశారద, ప్రావీణ్య, నగర నగర కమిషనర్ అశ్విని తానాజీ వాఖడేతో పాటు పలు శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమీక్షకు దూరంగా ఎమ్మెల్యే, మంత్రులు

ఉమ్మడి వరంగల్ అభివృద్ధిపై జరిగిన సమీక్ష సమావేశానికి పలువురు ప్రజాప్రతినిధులు దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. హనుమకొండ జిల్లా పరిధిలో ఉన్న హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ జిల్లా పర్యటనలో ఉన్నారు. ఆయన గురువారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లో పర్యటించారు. అలాగే భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడకు చెందిన ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హనుమకొండ జిల్లాలో వివిధ కార్యాక్రమాల్లో పాల్గొన్నారు. ఈ ఇద్దరు మంత్రులకు ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని తాము ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాలు ఉన్నా సమీక్షలో పాల్గొనకపోవటం చర్చనీయాంశంగా మారింది. అలాగే మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన ఉన్న నేపథ్యంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కూడా హైదరాబాద్‌లో జరిగిన సమీక్షకు డుమ్మా కొట్టారు. పాలకుర్తి ఎమ్మెల్యేతో పాటు మహబూబాబాద్, డోర్నకల్ ఎమ్మెల్యేలు కూడా హజరుకాలేదు. మరో వైపు ఉమ్మడి జిల్లా సమావేశాన్ని వరంగల్‌లో ఐదు రోజుల క్రితమే సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించారని, వారం రోజులు కూడా గడవక ముందే మళ్లీ హైదరాబాద్‌లో ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశం ఏమిటని కాంగ్రెస్ నేతల్లోనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. కాగా, ఈ సమీక్షకు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు కొందరు డుమ్మా కొట్టినప్పటికి బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు ముగ్గురు హజరుకావటం చర్చనీయాంశమైంది.


జయశంకర్ భూపాపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని సంక్షేమ గురుకుల పాఠశాలలో నిరసన చేస్తున్న సిబ్బంది

గురుకులాల్లో టైంటేబుల్‌ను మార్చాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 4: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నూతన టైంటేబుల్‌ను సత్వరమే మార్చాలని గురుకుల సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సంక్షేమ హాస్టళ్ల ముందు గురువారం నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వం ప్రవేశాపెట్టిన నూతన టైంటేబుల్‌తో విద్యార్థులకు ఫలితమేమి లేదని, సిబ్బందికి భారంగా మారుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఉపయోకగకరంగా లేని టైంటేబుల్‌ను ప్రభుత్వం పునరాలోచించి మార్చాలని వారు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన నిరసన ప్రదర్శనలో భాగంగా ఉమ్మడి జిల్లాల్లోని గురుకులాల్లో సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

నూతన సబ్‌స్టేషన్లలో నాణ్యత

ప్రమాణాలు పాటించాలి

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎండీ

హనుమకొండ టౌన్, జులై 4: కొత్తగా నిర్మించే సబ్‌స్టేషన్‌లలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి ఐదు జిల్లాల కన్‌స్ట్రక్షన్ డీఈ, ఏడీఈ, ఏఈలతో సీఎండీ గురువారం హనుమకొండ విద్యుత్‌భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. పాత సబ్‌స్టేషన్‌లన్నీ పునరుద్ధరణ చేయాలన్నారు. ప్రతీ సబ్‌స్టేషన్‌కు ప్రత్యామ్నాయ సరఫరా ఉండేటట్లు 1600 కిలోమీటర్ల మేర కొత్త లైన్లు ఏర్పాటు చేస్తున్నామని, డిసెంబర్‌లోపు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా లైన్‌లన్నీ పూర్తి చేయాలని సూచించారు. లెంతీలైన్‌ల మధ్య విద్యుత్ సమస్య త్వరతగిన గుర్తించి పరిష్కరించడం కోసం ఫాల్ట్‌ప్యాసేజ్ ఇండికేటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గోదావరి నదీతీరాల్లో కొట్టుకుపోయే లైన్‌ల శాశ్వత పరిష్కారం కోసం షిఫ్టింగ్ చేపడుతున్నమన్నారు. సింగిల్ ఫేజ్ ఉన్న ప్రాంతాల్లో 3 ఫేజ్‌కు మార్చుతున్నామని, వచ్చే 6 నెలల్లో అభివృద్ధి పనులన్నీ పూర్తికావాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు సదర్‌లాల్, సీజీఎంలు, జీఎంలు పాల్గొన్నారు


హనుమకొండ అశోక జంక్షన్ రాస్తారోకోలో విద్యార్థి జేఏసీ నాయకుల ఆందోళన

పేపర్ లీకేజీ మాఫియాకు కొమ్ముకాస్తున్న మోదీ ప్రభుత్వం

విద్యార్థి సంఘాల నాయకుల ఆరోపణ

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 4: పేపర్ లీకేజీ మాఫియా దోపిడీకి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కొమ్ముకాస్తోందని విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు విమర్శించారు. విద్యార్థి సంఘాల జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌లో భాగంగా గురువారం విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కేయూసీ క్రాస్ రోడ్ నుంచి అశోక జంక్షన్ వరకు వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పెద్ద ఎత్తున ర్యాలి నిర్వహించారు. ర్యాలీ అనంతరం అశోక జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహించారు.

ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. దేశంలో 10 యేళ్ల నుంచి ఇప్పటి వరకు 65 పేపర్ లీకేజీలు జరిగాయని విమర్శించారు. లీకేజీలను అరికట్టి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు న్యాయం చేయడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. దేశంలోని పేద వర్గాలకు ఉన్నత, వైద్య విద్యను దూరం చేసే కుట్రలో భాగంగానే నీట్, నెట్ పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. లీకేజీల వల్ల పేద విద్యార్థులు నష్టపోతున్నా మోదీ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. లీకేజీలకు మోదీ ప్రభుత్వం బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు. లీకేజీపై సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తితో విచారణ జరిపించి దోషులకు కఠిన శిక్షను విధించాలని వారు డిమాండ్ చేశారు. లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ అయిన ప్రాంతాలను గుర్తించి అక్కడ మరోసారి పరీక్షను నిర్వహించి విద్యార్థులకు నాయ్యం చేయాలన్నారు. ఎన్‌టీఏను రద్దు చేసి నీట్, నెట్ పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలన్నారు. లీకేజీ దోషులను గుర్తించి శిక్షించకపోతే విద్యార్థులతో కలిసి ఆందోళన కార్యక్రమాలను ఉధృతంగా చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో అన్ని ప్రైవేటు విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి బాషబోయిన సంతోష్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు పల్లకొండ సతీష్, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధానకార్యదర్శి బి. నర్సింహారావు, ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు రాచకొండ రంజిత్, యూఎస్ఎఫ్ఐ ఉమ్మడి జిల్లా ప్రధానకార్యదర్శి మాలవత్ రాజేష్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి బాషబోయిన వేణురాజ్, విద్యార్థి జేఏసీ నాయకులు కుమార్, చరణ్, రవితేజ, రాజుగౌడ్, వినయ్, పూర్ణ, మనోజ్, కుమార్, గణేష్, డానియల్, సుతిన్, ప్రణీత్, పవన్, పృథ్వీరాజ్, చరణ్, వంశీ, శరత్, రంజిత్, రాజు, రాజేష్, సురేష్ నాయక్, శివ కుమార్ నాయక్, అర్జున్ నాయక్, జశ్వంత్, వికాస్, రూపేష్, సాయి, కిరణ్ పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట, జూలై 4: కాజీపేట ఐటీఐలో 2024- 25 విద్యా సంవత్సరానికి మిగులు సీట్ల కోసం రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ పద్ధతిలో తగిన సర్టిఫికెట్‌లను అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. 10వ తరగతి మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపాదికన ఎంపిక జరుగు తుందని, ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 4 నుంచి 15వ తేదీలోగా iti.telangana.gov.in దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎన్ని కాలేజీలకైనా, ఎన్ని ట్రేడ్‌లకైనా ఒకటే ఆన్‌లైన్ దరఖాస్తు సరిపోతుందని, మెదటి విడతలో అప్లై చేసిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ఆప్షన్‌లు మాత్రమే సమర్పించాలని తెలిపారు.

హిందీలో కవితకు ఎంఫిల్

కేయూ క్యాంపస్, జూలై 4: హైదరాబాద్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ హిందీ విభాగం పరిశోధకురాలు కవితకు ఎంఫిల్ డిగ్రీ లభించింది. ఈమేరకు గురువారం అంబేద్కర్ ఓపెన్ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ బి.శ్రీనివాస్ కవితకు ఎంఫిల్ ప్రకటించినట్లు వెల్లడించారు. 'మైత్రేయి పుష్పాకే ఉపన్యాసోంమే నారీ చేతన' అనే అంశంపై పరిశోధనకు గ్రంథాన్ని రూపొందించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ హిందీ విభాగం ప్రొఫెసర్ షకీలా ఖానమ్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం గోవర్ధగిరి జిల్లా ఉన్నత పాఠశాలలో హిందీ పండిట్‌గా కవిత విధులు నిర్వహిస్తున్నారు.

దూరవిద్య పీజీ సైన్స్ కోర్సుల ఫీజు గడువు 15

కేయూ క్యాంపస్, జూన్ 28: కేయూ దూరవిద్య కేంద్రం 2024-25 ఏడాదికి సంబంధించిన పీజీ సైన్స్ ద్వితీయ ఏడాది కోర్సుల ఫీజులను జూలై 15 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించుకోవాలని కేయూ దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఇన్విరాల్‌మెంట్ సైన్స్‌లు అందబాటులో ఉన్నట్లు తెలిపారు. త్వరలోనే క్లాస్‌లను నిర్వహిస్తామని వెల్లడించారు. ఇతర వివరాలకు 0870-2461480, 2461490 నెంబర్‌లో సంప్రదించాలని డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం పేర్కొన్నారు.

కుక్, అసిస్టెంట్ కుక్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 4: హనుమకొండలోని లష్కర్ బజార్‌లోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న కుక్, అసిస్టెంట్ కుక్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా డీఈవో డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా సంవత్సరం చివరి వరకు కాంట్రాక్టు పద్ధతిలో పని చేసేందుకు ఆసక్తి, అర్హత కలిగిన వారు నేటి నుంచి ఈనెల 11 వరకు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కోరారు. జిల్లా ఎంపిక కమిటీ ద్వారా ఎంపిక జరగుతుందని, అనుభవం పనితీరు ఆధారంగా ఎంపిక జరుగుతుందని తెలిపారు.

[ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ]

కొత్తచట్టాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం..



- విద్యార్థులు, ముఖ్యంగా మహిళలకు అవగాహన కల్పిస్తాం
- కొత్త చట్టాలతో డిజిటల్, జీరో ఎఫ్ఐఆర్‌కు ప్రాధాన్యం పెరుగుతుంది
- 'ఆంధ్రజ్యోతి'తో వరంగల్ పోలీసుకమిషనర్ అంబర్ కిషోర్‌ఝా

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

దేశంలో ఈనెల ఒకటి నుంచి అమల్లోకి వచ్చిన కొత్త చట్టాల గురించి ప్రజల్లోకి తీసుకెళ్లుతున్నామని, విద్యార్థులు ముఖ్యంగా మహిళలకు ఈ చట్టాలకు అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తున్నామని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా పేర్కొన్నారు. గురువారం ఆయన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికిచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలు వెల్లడించారు. నగరంలో భూకబ్జాలపై ఉక్కుపాదం మోపటంతో పాటు గంజాయి దందా నిర్మూలనే లక్ష్యంగా ప్రత్యేకంగా బృందాన్ని ఏర్పాటు చేస్తున్నామని, సైబర్ నేరాల కట్టడికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను బలోపేతం చేసి.. ప్రజలు ఏ సమస్యతోనైనా నిర్భయంగా పోలీసు స్టేషన్లకు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి : కొత్త చట్టాల అమలుపై ఎలా ముందుకెళుతున్నారు?

సీపీ అంబర్ కిషోర్‌ఝా : ఈ నెల 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా కొత్త చట్టాలు అమల్లోకి వచ్చాయి. ఇప్పటికే ఈ చట్టాలపై వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సుమారు 1,800మందికి పైగా అన్ని విభాగాల్లోని సిబ్బందికి తెలంగాణ పోలీసు అకాడమీలో శిక్షణనిచ్చారు. ఇంకా టెలీ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎదురవుతున్న సమస్యలపై అవగాహన కల్పిస్తున్నారు. పోలీసులతో పాటు ప్రజలకు కూడా ఈ చట్టాలపైన అవగాహన కల్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. ఐపీసీ, సీఆర్‌పీసీ, ఇండియన్ ఎవిడెన్స్ స్థానంలో తీసుకవచ్చిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియమ్ (బీఎస్ఏ) చట్టాలపై మహిళలు, విద్యార్థినిలకు అవగాహన కల్పిస్తున్నాం. కళాశాలలు, పాఠశాలలతో పాటు మహిళ సంఘాల్లోని మహిళలకు కూడా అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్నాం. ప్రజలు ఏ సమస్య ఉన్న నిర్భయంగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదులు చేసుకోవచ్చు. అలాగే వాట్సాప్ నెంబరు 8712685070లో కూడా తమ ఫిర్యాదులను పంపొచ్చు.

ఆంధ్రజ్యోతి: కొత్త చట్టాలతో ప్రజలకు ఒనగూరే ప్రయోజనాలు?

సీపీ: ఈ కొత్త చట్టాలతో న్యాయవ్యవస్థ, నేర విచారణలో అనేక మార్పులు వచ్చాయి. జీరో ఎఫ్ఆర్ఐ, పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయగలిగే అవకాశం, ఎలక్ట్రానిక్ మోడ్‌లో సమన్లను జారీ చేయడం తదితర మార్పులు వచ్చాయి. డిజిటల్ పోలీసింగ్ సిటిజన్ సర్వీసెస్ కింద క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ ద్వారా పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ఎఫ్ఐఆర్ నమోదు చేయొచ్చు. అలాగే స్టేషన్ పరిధితో సంబంధం లేకుండా ఏ స్టేషన్‌లో అయినా జీరో ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేసే అవకాశం ఉంది. అంతేకాకుండా చిన్నారులపై సామూహిక అత్యాచారానికి పాల్పడేవారికి గరిష్ఠంగా మరణ శిక్ష విధించేలా కొత్త చట్టాల్లో నిబంధన ఉంది. మహిళలకు, చిన్నారులపై జరిగే నేరాలకు సంబంధించి కొత్త చట్టంలో ప్రత్యేకంగా సెక్షన్లు పొందపర్చారు. మైనర్లను కొనడం, అమ్మడం కూడా నేరమే. పెళ్లి పేరుతో లైంగిక దోపిడీకి పాల్పడితే గరిష్ఠంగా పదేళ్ల వరకు జైలు శిక్ష విధించేందుకు కొత్త చట్టాలు వీలు కల్పిస్తున్నాయి. ఇలా అనేక రకాలుగా ప్రజలకు ముఖ్యంగా మహిళల భద్రతకు ఈ కొత్త చట్టాలు ఉపయోగపడనున్నాయి.

ఆంధ్రజ్యోతి: కమిషనరేట్ పరిధిలో పోలీసుల పనితీరు ఎలా ఉంది?

సీపీ: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 45 పోలీస్‌స్టేషన్ల పరిధిలో అధికారులు, సిబ్బంది చాలా అద్భుతంగా పని చేస్తున్నారు. ఉదయం 10.30గంటలకు అన్ని పోలీస్ స్టేషన్లలో ఎస్‌హెచ్‌వోలు విధుల్లో ఉండేలా గైడ్‌లెన్స్ ఇచ్చాం. ఎస్‌హెచ్‌వో ఏదైనా పనిపై బయటకు వెళ్లాల్సి వస్తే, పై అధికారి స్టేషన్‌లో ఉండి, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిశీలిస్తున్నారు. ప్రజలకు చేరువ కావటానికి ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తున్నాం. స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఒక్కరి మర్యాదగా మాట్లాడటం, వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించటంతో పాటు వాటిని పరిష్కరించేందుకు దృష్టి పెడుతున్నారు. ఎస్‌హెచ్‌వోల స్థాయిలో సమస్య పరిష్కారం కాకుండా ఏసీపీలు, డీసీపీలను కలుస్తున్నారు. నా వద్దకు కూడా అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. మా పరిధిలో ఉన్న సమస్యలను పోలీసు యంత్రాంగం పరిష్కరిస్తుంది.

ఆంధ్రజ్యోతి: సైబర్ నేరాలను అరికట్టేందేకు తీసుకుంటున్న చర్యలు?

సీపీ: సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇటీవల కాలంలో వరంగల్ కమిషనరేట్ పరిధిలో సైబర్ మోసాలు పెరిగిపోతున్నాయి. పోలీస్‌శాఖ నుంచి ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. గుర్తు తెలియని నెంబర్ల నుంచి అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే ద్వారా అపరిచిత వ్యక్తులు ఎలాంటి వివరాలను ఇవ్వద్దు. ప్రజలు ఇలాంటి మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా లేకపోతే భారీగా నష్టపోవాల్సి వస్తుంది. రూ.2లక్షలకు పైగా సైబర్ మోసగాళ్లు దోచుకున్నట్లు మాకు ఫిర్యాదులు వస్తే వెంటనే కేసు నమోదు చేసి వాటిని రికవరీ చేస్తున్నాం. ఇటీవల జరిగిన లోక్ అదాలత్ ద్వారా సుమారు రూ.1కోటికి పైగా రికవరీ చేసి బాధితులకు అప్పగించాం. ఇప్పటికే వరంగల్ కమిషనరేట్‌లో సైబర్ క్రైం స్టేషన్‌ను ఏర్పాటు చేశాం. ఒక ఏసీపీతో పాటు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాం. ఎప్పటికప్పుడు సైబర్ మోసాలపై వస్తున్న కేసులను పరిష్కరించి బాధితులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: డ్రగ్స్ దందా పెరుగుతోంది? నియంత్రణపై దృష్టి పెట్టారా?

సీపీ : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగే నేరాలపై అప్రమత్తంగా ఉన్నాం. ప్రధానంగా మాదక ద్రవ్యాల వినియోగంపై దృష్టి పెట్టాం. ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్సును ఏర్పాటు కమిషనరేట్ పరిధిలో నేరగాళ్ల కదిలికలపై దృష్టి పెడుతున్నాం. విద్యాలయాలతో పాటు మార్కెట్లు, నేషనల్ హైవేలు, రద్దీ ప్రాంతాలపై దృష్టి పెట్టాం. చాలా వరకు మత్తు పదార్థాల విక్రయాలను నియంత్రించాం. వివిధ ప్రాంతాల నుంచి గంజాయి దిగుమతి అవుతున్నట్లుగా మా దృష్టికి వచ్చింది. సమాచారం వచ్చిన వెంటనే దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నాం. అయితే ప్రజలు కూడా సహకారాన్ని అందించాలి. గంజాయితో పాటు మత్తు విక్రయాలు జరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ప్రజల సహకారంతోనే దేన్నయినా అరికట్టేందుకు ఆస్కారం ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: భూకబ్జాలపై ఫిర్యాదులు పెరు గుతున్నాయి కదా..? వాటిపై మీరు తీసుకుం టున్న చర్యలు ఏమిటీ?

సీపీ: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో భూ కబ్జాలపై ఉక్కుపాదం మోపుతున్నాం. పేద ప్రజలకు పోలీసులు అండగా ఉంటున్నారు. అయితే భూములపై తమ పరిధిలో ఉన్న వాటిపైనే దృష్టి పెడుతున్నాం. తమ పరిధిలో లేని అంశాలను న్యాయం స్థానంకు వెళ్లి పరిష్కరించుకోవాలని సూచిస్తున్నాం. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే కేసుల్లో చాల వరకు భూములపై ఇరుగు పొరుగు మధ్య ఉండే సమస్యలతో పాటు హద్దులపై ఫిర్యాదులు చేసుకుంటున్నారు. అయితే అర్గనైజ్డ్‌గా కబ్జాలు చేయటం.. బెదిరింపులకు పాల్పడి బలవంతంగా భూములను లాక్కోవడం లాంటివి మా దృష్టికి రాలేదు. భూ కబ్జాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా చట్ట ప్రకారం చర్యలు ఉంటాయి.

మహిళా షూటర్‌కు సీపీ అభినందన



ఏఎస్సై సువర్ణను అభినందిస్తున్న సీపీ

వరంగల్ క్రైం, జులై 4: రాష్ట్ర స్థాయి మహిళా ఓపెన్ షూటింగ్ చాంపియన్ షిప్‌లో బంగారు పతకాన్ని సాధించిన అసిస్టెంట్ సబ్ ఇన్స్‌పెక్టర్ సువర్ణను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు. సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సువర్ణ.. గత నెల 21 నుంచి 28 వరకు హైదరాబాద్ సెంట్రల్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మహిళా ఓపెన్ షూటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో బంగారు పతకాన్ని అందుకుంది. అదేవిధంగా గత నెల 15 నుంచి 20 వరకు తమిళనాడులో నిర్వహించిన ఆల్ ఇండియా పోలీస్ స్పెషల్ మహిళా షూటింగ్ పోటీల్లో రాష్టం నుంచి పాల్గొని ఐదో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా సువర్ణ గురువారం సీపీ అంబర్ కిషోర్ ఝాను మర్యాదపూర్వకంగా కలిశారు. సువర్ణను కమిషనర్ అభినందించారు. క్రీడాకారులకు శాఖ పక్షాన ప్రోత్సాహం ఉంటుందన్నారు. సీపీని కలిసిన వారిలో ఆర్ఐ స్పర్జన్‌రాజ్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు శోభన్‌గౌడ్ ఉన్నారు.

మాదిగ దండోరా ఆవిర్భావ సదస్సుకు తరలి రండి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేదాసి మోహన్

కాశోజీ జంక్షన్, జూలై 4: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈ నెల 7న నిర్వహిస్తున్న మాదిగ దండోరా 30 యేళ్ల ఆవిర్భావ సదస్సుకు తరలి రావాల్సిందిగా ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేదాసి మోహన్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. జిల్లా, నియోజకవర్గాల రథసారథులు ఎమ్మార్పీఎస్ ఉద్యమ ఆరంభం నుంచి సుదీర్ఘ పోరాటంలో ఏబీసీడీ వర్గీకరణ కోసం పనిచేసిన ఉద్యమ నాయకులంతా సదుస్సులో పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు. సదస్సుకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ అధ్యక్షత వహించనున్నట్లు, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మాదిగ కులానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ముఖ్య అతిథులుగా సదస్సులో పాల్గొనన్నుట్లు ఆయన తెలిపారు. సదస్సులో పాల్గొన్న ముఖ్య అతిథులు, విశిష్ట అతిథులు, గౌరవ అతిథులు, రాష్ట్ర జాతీయ ప్రముఖులు, మేధావులు, కవులు, గాయకులను సన్మానించనున్నట్లు తెలిపారు. ఇంకా ఎమ్మార్పీఎస్‌కు చెందిన మాదిగ ఉద్యోగులు, విద్యార్థి నాయకులు, యువ సేన నాయకులను గుర్తించి సదస్సులో మేడి పాపయ్య మాదిగ, మంత్రి రాజనర్సింహ చేతుల మీదుగా సన్మానించనున్నట్లు మోహన్ తెలిపారు. సదస్సులో మాదిగ, మాదిగ ఉపకులాల సంస్కృతిపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ఐఎన్‌టీయూసీ జిల్లా చైర్మన్‌గా సుదర్శన్‌గౌడ్



వరంగల్ మెడికల్, జూలై 4: ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం ఐఎన్‌టీయూసీ 3194 ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్‌గా బత్తిని సుదర్శన్‌గౌడ్, కన్వీనర్‌గా చాడ బుచ్చిరెడ్డిలను నియమిస్తూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.శ్యాంసుందర్, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ బొందుగుల వెంకటేశ్వర్‌రెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బత్తిని సుదర్శన్‌గౌడ్ మాట్లాడుతూ.. 25 యేళ్లుగా వైద్య, ఆరోగ్యశాఖలోని అన్ని కేడర్స్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెద్ద ఎత్తున సమావేశాలు నిర్వహించి, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలను ఆహ్వానించనున్నట్లు తెలిపారు.

బాసర ట్రిపుల్ ఐటీకి సుబేదారి విద్యార్థిని ఎంపిక



కె. నిధి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 4: హనుమకొండ సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పాసైన విద్యార్థిని కె.నిధి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.నెహ్రూ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో 9.8 జీపీఏ సాధించిన నిధి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం పాఠశాలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని నిధిని ఉపాధ్యాయ బృందంతో కలిసి ఆయన అభినందించారు.

సంపదల్లో తరగనిది విద్య ఒక్కటే..

- 'ఆస్కార్' గ్రంథాలయం ప్రారంభోత్సవంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- స్వగ్రామంలో రూ.36లక్షల వ్యయంతో భవనం నిర్మించిన సినీ గేయరచయిత చంద్రబోస్



గ్రంథాలయం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర, పక్కన చంద్రబోస్

చిట్యాల, జూలై 4: సంపదల్లో తరిగిపోనిది విద్య ఒక్కటేనని, యువత గ్రంథాలయాలను వినియోగించుకుని విజ్ఞానాన్ని సముపార్జించుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు (జీఎస్సార్) పేర్కొన్నారు. చిట్యాల మండలం చల్లగరిగలో సినీగేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత కనుకుంట్ల చంద్రబోస్ తన తల్లి మధునమ్మ జ్ఞాపకార్థం రూ.36లక్షల వ్యయంతో నిర్మించిన 'ఆస్కార్' గ్రంథాలయ భవనాన్ని గురువారం ఆయన అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర, అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతమైన చల్లగరిగ గ్రామంలో జన్మించిన చంద్రబోస్ వేలాది సినీ గీతాలు రచించడంతోపాటు ఆస్కార్ అవార్డును కూడా అందుకుని ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. మంచి చేయాలని సంకల్పం ఉంటేనే ఇలాంటి గొప్ప పనులు చేయడం సాధ్యమవుతుందన్నారు. నగరాల స్థాయిలో రూ.36లక్షలు సొంత నిధులతో ఆధునిక హంగులతో భవనాన్ని నిర్మించడం అభినందనయామన్నారు. ఈప్రాంత ప్రజలు, నిరుద్యోగులు ఈ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పొందాలన్నారు. గ్రంథాలయం ప్రహరీ నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు చేస్తున్నట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే జీఎస్సార్ ప్రకటించారు. రెండు రోజుల్లో పనులు ప్రారంభ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

నా ఈ స్థాయికి మూలకారణం గ్రంథాలయమే ..

తాను ఈ స్థాయికి చేరుకోవడానికి తన ఊరి గ్రంథాలయంలోని పుస్తకాలను నిత్యం చదవడమేనని ఆస్కార్ అవార్డు గ్రహీత, సినీగేయ రచయిత కనుకుంట్ల చంద్రబోస్ అన్నారు. గతేడాది స్వగ్రామానికి వచ్చినప్పుడు ఇంటిపక్కనే ఉన్న గ్రంథాలయాన్ని చూశానని, తన జీవితానికి ఒక గుర్తింపు తెచ్చిన భవనం శిథిలావస్థలో ఉండడం బాధేసిందని, మరమ్మతు పనులు చేయించే విషయమై తన సతీమణి సుచిత్రతో చర్చించానని గుర్తుచేశారు. కానీ మరమ్మతు పనులు కాకుండా నూతన భవనాన్ని నిర్మిద్దామని ఆమె సలహా ఇవ్వడంతో గ్రామంలో ఏర్పాటు చేసి అభినందన సభలో నూతన భవన నిర్మాణ ప్రకటన చేశానన్నారు. అనుకున్న విధంగా కుటుంబసభ్యులు, గ్రామస్థులు, మిత్రుల సహాయంతో పూర్తిచేయడం సంతోషాన్నిచ్చిందన్నారు. త్వరలోనే అన్ని రకాల సాహిత్య పుస్తకాలతో పాటు ఉద్యోగ అవకాశాలకు ఉపయోగపడే పుస్తకాలను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఈ సందర్భంగా సుచిత్ర, చంద్రబోస్ దంపతులను ఎమ్మెల్యే జీఎస్సార్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సన్మానించారు. స్థానిక వాణీ విద్యానికేతన్ విద్యార్థుల నృత్యాలు స్థానికులను అకట్టుకున్నాయి. కార్యక్రమంలో తెలంగాణ పౌర గ్రంథాలయ శాఖ డైరెక్టర్ ఏపీఎస్ రాజు, గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి తూర్పాటి శ్రీలత, చంద్రబోస్ తండ్రి నరసయ్య, మాజీ ఎంపీపీ దావు వినోదవీరారెడ్డి, ఎంపీవో రామకృష్ణ, సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామిడి సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చంద్రబోస్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ఐటీ రంగానికి ప్రభుత్వం పెద్ద పీట

జిల్లాలో ఐటీ రంగాన్ని విస్తృతపరుస్తాం : రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

వడ్డేపల్లి, జూలై 4: ఐటీ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఐటీ రంగాన్ని విస్తృత పరుస్తామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఇండస్ట్రీస్, కామర్స్, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. గురువారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని ఇందిరానగర్ జంక్షన్ వద్ద రావుల రంజిత్‌కుమార్‌రెడ్డి ఏర్పాటుచేసిన రాక్స్ ఐటీ సొల్యూషన్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించి జ్యోతి ప్రజ్వలన గావించారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. రావుల రంజిత్‌కుమార్‌రెడ్డి అమెరికాలో స్థిరపడి వ్యాపారం చేస్తూ వరంగల్ ప్రాంతంలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో రాక్ ఐటీ సొల్యూషన్ సంస్థను ఏర్పాటు చేశారని అన్నారు. ఓరుగల్లు నగరం విద్యాలయాలకు పుట్టినిల్లు అని అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ నిట్ వంటి విద్యా కేంద్రాలు ఉన్నాయని అన్నారు. వరంగల్‌లోని మానవ వనరులు అమెరికా లేదా ఇతర ప్రదేశాలకు వెళ్లకుండా వారి ఇంటి వద్దనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో ఇక్కడే చిన్న, సూక్ష్మ, మధ్యతరహా.. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ రంగానికి పెద్దపీట వేయాలనేదే ప్రభుత్వ లక్ష్యమని శ్రీధర్‌బాబు అన్నారు. వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్ లాంటి నగరాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ఈ ప్రాంత వాసులకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. వరంగల్ ప్రాంతంలోని మామునూరు విమానాశ్రయం నిర్మాణం పెండింగ్‌లో ఉందని, ఈ సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. వరంగల్‌లో టెక్స్‌టైల్ పరిశ్రమతో పాటు మరెన్నో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రణాళికలు రూపొందించారని చెప్పారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి టీజీపీఎస్సీ ద్వారా నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేస్తామని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ప్రైవేటు రంగంలో కూడా ఉపాధి కల్పన చేస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మె ల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, రాక్స్ ఐటీ సొల్యూషన్ స్థాపకుడు రావుల రంజిత్ రెడ్డితోపాటు రావుల శేషుకుమార్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేతలు ఈవీ శ్రీనివాసరావు, బంక సరళ సంపత్ యాదవ్, తేళ్ల సుగుణ కిశోర్, కొండా నాగరాజు, మండల సమ్మయ్య, ఎం.డి. అక్మల్, ధన్‌రాజ్, తాళ్లపల్లి రవీందర్, ఎం.డి. ఆరిఫ్, జనగాం శ్రీనివాస్‌గౌడ్, కరాబు రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

దాశరథి శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలి

ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్



మీడియాతో మాట్లాడుతున్న దేశపతి శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, జూలై 4 : 'నా తెలంగాణ.. కోటి రతనాల వీణ' అని ఎలుగెత్తి చాటి స్వరాష్ట్ర ఉద్యమానికి ప్రేరణనందించిన ప్రముఖకవి దాశరథి కృష్ణమాచార్యులు శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాశరథి శతజయంతి ఉత్సవాలు ఈనెల 22న ప్రారంభమై సంవత్సర కాలం పాటు ఘనంగా నిర్వహించాలని సాహితీవేత్తలు, కవులు, రచయితల సంఘం వారితో చర్చించి, నిర్ణయించినట్లు చెప్పారు. అదేరోజు దాశరథి జన్మస్థలం చిన్నగూడూరు మండలకేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, మానుకోట పట్టణంలో శతజయంతి సభను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సభకు ప్రముఖ కవి నందిని సిద్ధారెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్‌తోపాటు ఎంపీ బలరాంనాయక్, మానుకోట, డోర్నకల్ ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, రాంచంద్రునాయక్‌ను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. పెద్దసంఖ్యలో హాజరై జయంతి ఉత్సవాలను విజయంతం చేయాలని ఆయన కోరారు.

నిజాం నవాబును ఎదిరించిన కవి దాశరథి..

చిన్నగూడూరు గడ్డ మట్టిలో పుట్టిన దాశరథి కృష్ణమాచార్యులు నాడు నిజాం నవాబును ఎదిరించి, జైలుకు వెళ్లి ఆ గోడలపై ఓ నిజాం పిశాచామా అని రాసిన ధీరుడని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ కొనియాడారు. తన కలం ద్వారా అనేక కవితలు రాసి, ప్రజలను చైతన్యవంతులను చేశారని తెలిపారు. అగ్రశ్రేణి కవుల్లో ఆయన ఒకరని అలాంటి మహనీయున్ని స్మరించుకుని వారి చరిత్రను బావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. తెలంగాణ విముక్తి ఉద్యమంలో తనదైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ.. దాశరథి ఈ ప్రాంతం వారు కావడం తమకు ఎంతో గర్వకారణమన్నారు. దాశరథి శతజ యంతి ఉత్సవ సభకు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, బీఆర్ఎస్ నాయకులు మంగలంపల్లి కన్న, ఎడ్ల వేణు, గుర్రపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకో రూల్.. మాకో రూలా?

- బదిలీల మార్గదర్శకాలపై ఉద్యోగుల గుర్రు
- మాకూ మూడేళ్లు సడలింపు ఉండాల్సిందేనని పట్టు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 4: ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. బదిలీలపై నిషేధం ఎత్తివేస్తూ బదిలీలకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. ప్రభుత్వం బదిలీలపై విడుదల చేసిన మార్గదర్శకాలపై ఉద్యోగులు గుర్రుగా ఉన్నారు. బదిలీల కోసం ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలను ఉద్యోగులకు మింగుడుపడటం లేదు. ఇటీవల కాలంలో జరిగిన ఉపాధ్యాయుల బదిలీల మార్గదర్శకాలకు, ఉద్యోగుల మార్గదర్శకాలు భిన్నంగా ఉండటాన్ని వారు విమర్శిస్తున్నారు. పదవీ విరమణకు మూడేళ్ల సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులను బదిలీల నుంచి మినహాయించిన ప్రభుత్వం ఉద్యోగుల విషయంలో మాత్రం కేవలం ఒకే ఒక్క సంవత్సరం నిబంధన విధించడం సరికాదనే అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. గత ప్రభుత్వ కాలంలో జీవో నెం.317తో నష్టపోయిన ఉద్యోగులకు న్యాయం చేసేందుకు మంత్రివర్గ ఉపసంఘంను నియమించి దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం వాటిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే బదిలీలు చేపట్టడాన్ని సైతం ఉద్యోగులు తప్పుబడుతున్నారు.

మాకూ మూడేళ్లు కావాలి..

మెన్నీమధ్యనే నిర్వహించిన ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియలో రూపొందించిన మార్గదర్శకాలను ఉద్యోగుల బదిలీలకు వర్తింపజేయాలనే డిమాండ్‌ను ఉద్యోగులు తెర మీదకు తెస్తున్నారు. పదవీ విరమణకు మూడేళ్లకాలం ఉన్న ఉపాధ్యాయులను బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చారు. అలాగే వారికి మూడేళ్ల మినహాయింపును ఇవ్వాలని, ప్రభుత్వం పునరాలోచించి ఉద్యోగుల బదిలీల మార్గదర్శకాలను మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగుల మధ్య ప్రభుత్వం ఇలాంటి తేడాలు సృష్టించడం సరికాదంటున్నారు. అర్హతలను ఉద్యోగులకు సమాన అవకాశాలను కల్పించాలని వారు కోరుతున్నారు. మూడేళ్ల కాలపరిమితితోనే బదిలీలు చేపట్టాలంటున్నారు.

జీవో నెంబరు 317 కథ కంచికేనా...?

గత ప్రభుత్వం జీవో నెంబరు 317తో ఉపాధ్యాయ, ఉద్యోగులను అనైతిక బదిలీలు చేపట్టిందని, నష్టపోయిన వారికి న్యాయం చేయాలనే డిమాండ్ రావడంతో ప్రభుత్వం మంత్రి వర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఈ జీవో ద్వారా నష్టపోయిన ఉద్యోగులకు న్యాయం చేస్తామని అప్పీల్స్ స్వీకరించిన ప్రభుత్వం వాటిని పరిష్కరించకుండానే బదిలీలు చేపట్టడాన్ని ఉద్యోగులు తప్పుబడుతున్నారు. జీవో నెంబరు 317లో న్యాయం జరుగకుండానే బదిలీలు అయ్యే ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో దొడ్డి కొమురయ్య వర్ధంతి

మహబూబాబాద్ టౌన్, జూలై 4 : జిల్లా వ్యాప్తంగా తెలంగాణ సాయుధ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి, పలువురు నివాళులర్పించారు. మహబూబాబాద్ అంబేడ్కర్ సెంటర్‌లో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి పాయం చిన్నచంద్రన్న మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో భూస్వామ్య దోపిడీ, దౌర్జన్యాలు, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, పూనం ప్రభాకర్, మలుకూరి జగ్గన్న, బిల్లకంటి సూర్యం, కె.భాస్కర్‌రెడ్డి, పైండ్ల యాకయ్య, ఈరెల్లి మల్లేష్ పాల్గొన్నారు.

● మహబూబాబాద్ నెహ్రూసెంటర్‌లో గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో కొమురయ్య వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పయ్యావుల మల్లయ్య, కురుమసంఘం జిల్లా అధ్యక్షుడు చీర అశోక్, రఘు, రాకేష్, యాదగిరి, మల్లయ్య ప్రభాకర్, వెంకట్, శ్రీను, కుమారస్వామి, వెంకన్న, కల్యాణ్, అనిల్, రమేష్ పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..

● దంతాలపల్లి మండలం పెద్దముప్పారంలో దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద పూలమాల వేసి, నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఉడుగుల రాములు, ముంజంపల్లి వీరన్న, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

● పెద్దవంగర మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. జీఎంపీఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెరబోయిన రాజుయాదవ్, బుచ్చన్న, శ్రీశైలం, రాంమ్మూర్తి, విక్రమ్, ఊషయ్య, సుభాష్, త్యాగరాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, జడ్పీటీసీ శ్రీరాంజ్యోతిర్మయి సుధీర్, వి.రాంచంద్రయ్యశర్మ, గంగాధర్, హరీష్, రాంమ్మూర్తి, వీరన్న పాల్గొన్నారు.

● కొత్తగూడలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. కంగాల పాపయ్య, చిత్తారి పాపయ్య, అప్పారావు, రాజు, ప్రవీన్ పాల్గొన్నారు.

● తొర్రూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. నాయకులు పెదగాని సోమయ్య, సోమ రాజశేఖర్, సంతోష్ పాల్గొన్నారు. సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. కొమురయ్యచిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. సీపీఎం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్యకు ఘననివాళ్లర్పించారు. జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్, యాకూబ్, శ్రీనివాస్, వీరన్న, యాకయ్య, బీకు పాల్గొన్నారు. సీపీఐ నాయకులు మహేందర్, లక్ష్మణ్, వెంకన్న, యాకయ్య ఉన్నారు.

● కురవిలో సీపీఐ కార్యాలయంలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శినల్లు సుధాకర్‌రెడ్డి, మండల కార్యదర్శి కర్నం రాజన్న, దూదికట్ల సారయ్య, నిలుగొండ నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్, తురక రమేష్ పాల్గొన్నారు.


మానుకోటలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా నేతలు

● నెల్లికుదురు, మేచరాజుపల్లిలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో ముంజంపల్లి వీరన్న, బండపల్లి వెంకటేశ్వర్లు, జక్కుల యాకయ్య ఇరుగు అనిల్, వెంకన్న, కావటి రమేష్, తోట బాబు, రాములు, కృష్ణమూర్తి, రాంనర్సయ్య పాల్గొన్నారు.

●గూడూరులో యాదవసంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. మండల అధ్యక్షుడు గుండెబోయిన మల్లేష్, నూకల ఉపేందర్, నూకల సురేందర్, బత్తుల వెంకన్న, లక్ష్మణ్, రాసాల శ్రీనివాస్, వంగపండ్ల మల్లేష్, పోతరాజు రవి, కాసరబోయిన వీరమల్లు పాల్గొన్నారు.

● బయ్యారంలో దొడ్డి కొమరయ్య వర్ధంతి జరిగింది. సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నాయకులు గాంధీ సెంటరలోని అమరవీరుల స్థూపం వద్దకొమరయ్య చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. మహబూబాబాద్ డివిజన్ కార్యదర్శి జగ్గన్న, మండల కార్యదర్శి బిల్లకంటి సూర్యం, నాయకులు సత్యం, ధనంజయ, పూర్ణ, రమేష్, వెంకన్న, శ్రీను, జానీ, నారాయణ రెడ్డి, గణేష్ పాల్గొన్నారు.

మతోన్మాదం సమాజానికి ప్రమాదకరం : సీపీఎం

కేసముద్రం, జూలై 4 : మతోన్మాదం సమాజానికి అత్యంత ప్రమాదకరమైందని, ప్రతీ దేశంలో మెజార్టీ మతం వాళ్లు, మైనార్టీలపై ఆధిపత్యం చెలాయించేందుకు ప్రయత్నిస్తుండడంతోనే సమస్యలు వస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ అన్నారు. కేసముద్రం హరిహర గార్డెన్స్‌లో జిల్లా నాయకుడు మార్తినేని పాపారావు అధ్యక్షతన మూడు రోజులపాటు నిర్వహించే పార్టీ జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. తొలుత పార్టీ జెండాను సీనియర్ నాయకుడు బొబ్బాల యాకూబ్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో ఆయా మతాలు మెజార్టీ స్థానంలో ఉందని, ఈ మతాలన్నీ ఆయా ప్రాంతాల్లోని మైనార్టీలపై ఆధిపత్యం చెలాయించడంతోనే మతపరమైన సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అన్నారు. దొడ్డి కొమురయ్య వీరమరణంతోనే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ప్రారంభమైందని, ఈ పోరాటంతో దేశంలో భూసంస్కరణలు జరిగినట్లు గుర్తుచేశారు. కార్యక్రమాల్లో పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, కార్యదర్శివర్గ సభ్యుడు గునిగంటి రాజన్న, సూర్నపు సోమయ్య, అలువాల వీరయ్య మంద రాజన్న, కందునూరి శ్రీనివాస్, సమ్మెట రాజమౌళి, కుంట ఉపెందర్, గాడిపల్లి ప్రేమ, కుర్ర మహేష్, మోడెం వెంకటేశ్వర్లు, చాగంటి కిషన్, జయరాజ్ పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్

గడ్డిమందు తాగిన విద్యార్థి మృతి


మృతిచెందిన సంజయ్‌రెడ్డి

దంతాలపల్లి, జూలై 4 : ఓ విద్యార్థి ఇంట్లో తల్లిందండ్రులు దాచిన డబ్బును ఖర్చు చేసుకోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన రేపోణిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సాదు సంజయ్‌రెడ్డి (20) జూన్ మొదటి వారంలో ఇంట్లో ఎవరూ లేనిసమయంలో గడ్డి మందును తన వ్యవసాయ బావివద్ద తాగాడు. ఈ క్రమంలో సంజయ్‌రెడ్డి గడ్డిమందు తాగిఇంటికి రావడంతో పురుగులమందు తాగినట్టు గమనించిన బంధువులు ఆయనను వరంగల్‌లోని ఓప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సంజయ్‌రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందడంతో తండ్రి సాయిరెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంజయ్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందుతాగి మహిళ..


మృతి చెందిన ఉమారాణి

దంతాలపల్లి : పురుగుల మందుతాగిన ఓ మహిళ గురువారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై కరుణాకర్ కథనం ప్రకారం. ముంగిమడుగుకు చెందిన దప్పుకంటి ఉమారాణి (30) బుధవారం తల్లిగారి ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో తల్లి కూతురుకు మధ్య గొడవ రావడంతో మనస్తాపానికి గురైన ఉమారాణి పురుగుల మందు తాగింది. బంధువులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. గురువారం ఆమె చికిత్స పొందుతూ మృతి చెందడంతో భర్త దేవదానం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

వివాహం కావడంలేదని ..

తొర్రూరు రూరల్ : వివాహం కావడంలేదని మనస్థాపంతో ఓ వ్యక్తిమృతి చెందిన ఘటన ఫత్తేపురంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై జగదీష్ కథనం ప్రకారం. గత కొన్నిరోజులుగా వివాహం కావడంలేదని మనస్థాపం చెందిన కుంభం సంపత్‌రెడ్డి (38) బుధవారం రాత్రి ఇంట్లో అందరు నిద్రిస్తున్న క్రమం లో పురుగుల మందుతాగి మృతి చెందినట్లు తెలిపారు. తండ్రి కుంభం ఉప్పల్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టంకు తరలించిన్నట్లు ఎస్సై జగదీష్ వెల్లడించారు.

రేషన్ బియ్యం పట్టివేత

చిన్నగూడూరు, జూలై 4 : మంగోరి గూడెం రేషన్‌షాప్ నుంచి అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని గురువారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఏఎస్సై మంగ్యానాయక్ తెలిపిన వివరాల ప్రకారం. మంగోరిగూడెం రేషన్‌షాప్ నుంచి అక్రమంగా ఆటోలో కోళ్లఫామ్‌కు తరలిస్తున్న 14 బస్తాల (5 క్వింటాళ్ల) పీడీఎస్ బియ్యం పట్టుకొని రేషన్‌షాప్ డీలర్, కోళ్లఫామ్ యాజమాని, ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

వివాహిత ఆత్మహత్యకు కారణమైన వ్యక్తి అరెస్ట్

నెల్లికుదురు, జులై 4 : వివాహిత పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన వ్యక్తిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. పెద్దతండాలో జూన్ 30న బానోత్ నీలమ్మ (35) ఇంట్లోకి అదే గ్రామానికి చెందిన బానోత్ వీరన్న వెళ్లి బలత్కారం చేయడానికి ప్రయత్నించగా అవమానం భరించలేక నీలమ్మ, ఆమె భర్త భద్రు పురుగుల మందుతాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. నీలమ్మ మృతి చెందిగా ఆమె భర్త భద్రు తొర్రూరు ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నీలమ్మ మృతికి కారణమైన నిందితుడు బానోత్ వీరన్నపై కేసు నమోదు చేసి అరెస్టుచేసినట్లు ఎస్సై పేర్కొన్నాడు.

పాతబజారులో యువతి అదృశ్యం


భవాని (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, జూలై 4 : మానుకోట పట్టణంలోని దాసరి బజారుకు చెందిన రౌతు భవాని అదృశ్యమైనట్లు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ గురువారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. దాసరి బజారుకు చెందిన భవాని జిల్లా కేంద్రంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. ఈనెల 1న సూర్యాపేటలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి, నేటికి ఇంటికి చేరలేదని చెప్పారు. బంధువుల ఇండ్లలో వాకబు చేసినప్పటికి ఎక్కడ ఆచూకీ లభ్యం కాకపోవడంతో భవాని తండ్రి సంపత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ

మహబూబాబాద్ రూరల్, జూలై 4 : జిల్లా కేంద్రం శివారు భట్టుతండా అంగన్‌వాడీ సెంటర్‌లో ఈనెల 1న రాత్రి చోరీ జరిగినట్లు అంగన్‌వాడీ టీచర్ బానోత్ శారద గురువారం తెలిపారు. శారద తెలిపిన వివరాల ప్రకారం. అంగన్‌వాడీ సెంటర్‌లోని గ్యాస్ సిలిండర్, కుక్కర్, 5 కిలోల పప్పు, 5 కేసుల కోడి గుడ్లు, రెండు కుర్చీలను అపహరించుకుపోయినట్లు చెప్పారు. ఈ విషయంపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు శారద తెలిపారు.

భూములున్న వారికే రైతుబంధు, బీమా వర్తింపజేయాలి

● గూడూరు సొసైటీ చైర్మన్ చల్లా లింగారెడ్డి

గూడూరు, జూలై 4 : భూములు ఉన్న ప్రతీ రైతుకు షరతులులేకుండా రైతుబంధు, రైతుబీమా వర్తింప చేయాలని గూడూరు సోసైటీ చైర్మన్ చల్లా లింగారెడ్డి అన్నారు. గూడూరు సొసైటీ ఆవరణలో గురువారం ఏవో ఆల్లె రాకేష్ అధ్యక్షతన మహాజన సభ జరుగా, ఆయన మాట్లాడారు. రైతులకు ఉన్న భూముల మీదషరతులు లేకుండా నూటికి నూరుశాతం రైతుబంధు, రైతుబీమా ఇవ్వాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి అభిమన్యు, నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ హరీష్‌రెడ్డి, వైస్ చైర్మన్ నరేష్‌రెడ్డి, డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ చైతన్య, వైస్‌చైర్మన్ శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్లు మల్లేష్, యాకాంబ్రం, కత్తి వెంకన్న, యాకూబ్‌పాషా, యాకయ్య, మార్కెట్ డైరెక్టర్ సమ్మెట శ్రీనివాస్ పాల్గొన్నారు.

● సీరోలు : సాగుచేసే వ్యవసాయ భూములకే రైతుబంధు ఇవ్వాలని రైతులు అభిప్రాయం వ్యక్తం చేసినట్లు మండల వ్యవసాయాధికారి మంజుఖాన్ తెలిపారు. కాంపల్లి రైతు వేదికలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో రైతుభరోసా (రైతుబంధు) ఎవరికి ఇవ్వాలనే అంశంపై రైతుల నుంచి అభిప్రాయసేకరణ చేపట్టినట్లు తెలిపారు. సొసైటీ చైర్మన్ కొత్తకొండ శ్రీనివాస్, కేలోతు సురేష్, భోజ్యానాయక్, బోడ సుశీల మంగ్యానాయక్, కొప్పుల వెంకటరెడ్డి,రామసాని ఉపేందర్, మక్కల వెంకన్న, బాలాజీ, దేవ, ఏఈవో శిరీష పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ ప్రశాంతం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 4 : జిల్లాలో గురువారం ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. నీట్ పరీక్షను రద్దుచేసి మళ్లీ పరీక్షను నిర్వహించాలని దేశ వ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆందోళన చేస్తున్నప్పటికీ కేంద్రం ప్రభుత్వం స్పందించకపోవడంతో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూ, వీజేఎస్, ఏఐవైఎఫ్ ప్రైవేటు విద్యాసంస్థల బంద్‌కు పిలుపునివ్వగా జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు స్వచ్ఛందంగా మూసివేశారు. ఈ సందర్భంగా ఐక్యవిద్యార్థి సంఘాల నాయకులు పట్ల మధు, వెలుగు శ్రావణ్, చరణ్‌గౌడ్, ఇరుగు మనోజ్, ప్రవీణ్‌ల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారుల్లో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ ర్యాలీలో నాయకులు చంటి, వెంకటేష్, అశోక్, రాకేష్, హన్మ, చందు, వికాస్, మహేష్ పాల్గొన్నారు.

పిల్లలకు నోట్‌బుక్స్, బ్యాగుల పంపిణీ


పిల్లలకు స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ బాధ్యులు

మహబూబాబాద్ టౌన్, జూలై 4 : జిల్లా కేంద్రంలోని ఆశ అనాథశ్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి చాడ అశోక్‌రెడ్డి-నేహ దంపతుల కుమారుడు అగస్త్య పుట్టిన రోజు సందర్భంగా గురువారం 25 మంది పిల్లలకు స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్ పంపిణీ చేసి అన్నదానం చేశారు. పిల్లలకు స్కూల్ బ్యాగ్స్, నోట్‌బుక్స్ అందించిన అగస్త్య వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ రామసహాయం వెంకట్‌రెడ్డి మాట్లాడారు. క్యాబినెట్ సెక్రటరీ అనుమాల వెంకటేశ్వర్లు, మాధవపెద్ది వెంకట్‌రెడ్డి, క్లబ్ అధ్యక్ష, కోశాధికారి యాళ్ల మురళీధర్‌రెడ్డి, అనుమాల సిద్ధార్థ్, పీవీ ప్రసాద్, డాక్టర్ బానోత్ వీరన్న, ప్రదీప్‌రావు, ముల్లంగి అన్వేష్, డాక్టర్ జ్యోతి పాల్గొన్నారు.

బిందుసేద్యం, ఎరువులకు రాయితీ

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 4 : ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని మొక్కలకు బిందుసేద్యం పరికరాలకు, ఎరువులకు, అంతర్ పంటలకు రాయితీలు కల్పిస్తుందని జిల్లా ఉద్యానవన, పట్టుపరిశ్రమ అధికారి జినుగు మరియన్న తెలిపారు. మానుకోటలోని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ కార్యాలయంలో ఉద్యాన శాఖ అధికారులు, అయిల్‌ఫెడ్ ఫీల్డ్ అధికారులతో గురువారం అయిల్‌పామ్ సాగుపై సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మరియన్న మాట్లాడుతూ రైతులు పంట మార్పిడిచేసి అయిల్‌ఫామ్ విస్తరణకు పాటుపడాలని కోరారు.ఉద్యాన అధికారులు రాకేష్, అనితశ్రీ, అయిల్‌ఫెడ్ జిల్లా ఇన్‌చార్జ్ శ్రీరాములు పాల్గొన్నారు.

‘మాకుల’ ఆలయ హుండీల లెక్కింపు

మరిపెడ, జూలై 4 : మరిపెడ మాకుల వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీలను గురువారం ఆలయ ధర్మకర్తలు, అర్చకులు, మానుకోట సేవ సమితి సభ్యులు, భక్తులు లెక్కించారు. మాకుల జాతర తర్వాత నుంచి ఇప్పటి వరకు వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీల్లో భక్తులు రూ.3,61,590 సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారని అనువంశిక చైర్మన్ ఎస్సీహెచ్ రామానుజాచార్యులు తెలిపారు. జిల్లాఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ కవిత పర్యవేక్షించారు. ఆలయ ఈవో కె.వేణుగోపాల్, రంగారెడ్డి, లక్ష్మణాచార్యులు, లక్ష్మినర్సింహచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేరడ విద్యార్థికి త్రిపుల్ ఐటీలో సీటు

కురవి, జూలై 4 : మండలంలోని నేరడ ఆదర్శ పాఠశాలకు చెందిన షేక్.అమీన్‌కు బాసర త్రిపుల్ ఐటీలో సీటు లభించినట్లు ప్రిన్సిపల్ ఆర్.అరుణ తెలిపారు. 10వ తరగతిలో కురవి మండల టాపర్‌గా నిలిచిన షేక్ అమీన్‌కు త్రిపుల్ ఐటీలో సీటు రావడం పాఠశాలకు గర్వకారణమని ప్రిన్సిపల్ అన్నారు. సీటు సాధించిన అమీన్‌ను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

సేవ చేయడం అదృష్టంగా భావించాలి

● జడ్పీటీసీ శ్రీరాం జ్యోతిర్మయి సుధీర్

పెద్దవంగర, జూలై 4 : ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావించాలని జడ్పీటీసీ శ్రీరాం జ్యోతిర్మయి సుధీర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వేణుమాధవ్ ఆధ్వర్యంలో పదవీకాలం కాలం పూర్తి చేసుకున్న ఎంపీపీ, ఎంపీటీసీలను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో మండలాన్ని అభివృద్ధి పరచడానికి సహకరించిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. పదవీ కాలం ముగిసినప్పటికీ ప్రజల్లోనే ఉండి సమస్యల పరిష్కరించేందుకు తమ సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎర్ర సబిత వెంకన్న, వైస్ ఎంపీపీ కల్పనరాజుయాదవ్, ఎంపీటీసీలు విజయ, రవీందర్, అనురాధ, సౌజన్య, పీఆర్ఏఈ దయాకర్, ఎంపీవో సత్యనారాయణ, ఆయా శాఖాల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు ఘన సన్మానం

గంగారం : మండల ప్రజాప్రతినిధుల పదవి కాలం పూర్తయిన సందర్భంగా మండల కేంద్రంలో ప్రజా ప్రతినిధులకు ప్రజలు, నాయకులు గురువారం ఘనసన్మానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్లు మాట్లాడారు. గంగారం మండల అభివృద్ధికి పాటు పడిన జడ్పీటీసీ ఈసం రమా, ఎంపీపీ సువర్ణపాక సరోజన, వైస్ ఎంపీపీ ముడిగ వీవభద్రలను ఆయన ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్కే సయ్యద్, రాదారపు కొమరయ్య, దనసరి కమలహాసన్, మద్దెల సాంబయ్య ముడిగ విజయ్, ఈక సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన వాహనాలకు 8న వేలం

తొర్రూరు, జూలై 4 : గుడుంబా బెల్లం సరఫరా చేస్తూ వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాల వేలం నిర్వహించనున్నట్లు తొర్రూరు ఎక్సైజ్ ఇన్‌చార్జ్ సీఐ ఆర్. ప్రవీణ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొర్రూరు స్టేషన్ పరిధిలోని వివిధ మండలాల పరిధిలో స్వాధీనం చేసుకున్న వాహనాలను ఈనెల 8వ తేదీ ఉదయం 11 గంటలకు స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహించడం జరుగుతుందని, వేలంలో పాల్గొనే వారు ముందుగా కార్యాలయంలో సంప్రదించి ఎక్సైజ్ నిబంధనలు పాటించాలన్నారు.

మూడు టిప్పర్ బ్యాటరీలు చోరీ

డోర్నకల్, జూలై 4 : మండలంలోని ముల్కలపల్లిలో బుధవారం రాత్రి మూడు టిప్పర్లకు సంబంధించిన బ్యాటరీలుచోరీ గురైనట్లు యాజమాని సామినేని సతీష్ డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి టిప్పర్లను తమ సొంత స్థలంలో పార్కింగ్ చేసి డ్రైవర్లు వెళ్లిపోయారని చెప్పారు. గురువారం ఉదయం వచ్చి చూడగా మూడు టిప్పర్లకు సంబంధించి ఆరు బ్యాటరీలు చోరీకి గురైనట్లు చెప్పారు. చోరీకిగురైన బ్యాటరీల విలువ సుమారు రూ.75 వేలకు పైగా ఉంటుందని అన్నారు. ఈ మేరకు డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సతీష్ తెలిపారు.

రికార్డు నమోదులో లోపం ఉంటే కఠిన చర్యలు

దంతాలపల్లి, జూలై 4 : గ్రామ పంచాయతీ రికార్డులో ఏదేని సమాచారం నమోదులో లోపం ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సవ్ టొప్పో హెచ్చరించారు. గురువారం ఆయన మండంలోని వాల్యతండా, లక్ష్మీపురం జీపీలో రికార్డులను పరిశీలించారు. ఎంపీవో అప్సరపాషా, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎర్రబెల్లి జన్మదిన వేడుకలు

పెద్దవంగర, జూలై 4 : మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎర్రబెల్లి దయాకర్ 68వ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో జడ్పీటీసీ శ్రీరాంజ్యోతిర్మయి సుధీర్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, మాజీ పాలకుర్తి దేవస్థాన చైర్మన్ రామచంద్రయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు మొక్కలను నాటి, కేక్‌కట్ చేశారు. బీఆర్ఎస్ దుంపల సమ్మయ్య, జ్ఞానేశ్వరాచారి, చింతల భాస్కర్, రాజేందర్, బీమా, రాజేందర్, గంగాధర్, వీరన్న, హరీష్, రాంమూర్తి, బిక్షపతి, షర్ఫుద్దీన్, శ్రీనివాస్, సుభాష్, ఉషయ్య, వేణు, సుభాష్ అనుదీప్, ప్రదీప్, వెంకన్న, మహేష్, గౌస్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● తొర్రూరు : మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు జన్మదిన వేడుకలను తొర్రూరులో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విశ్రాంతి భవనంలో రక్తదాన శిబిరం, కేక్ కటింగ్, మధ్యాహ్నం మహాన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వంద యూనిట్ల రక్తం సేకరించి రెడ్‌క్రాస్‌కు అప్పగించారు. జడ్పీటీసీ శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు సీతారాములు, బీఆర్ఎస్ నాయకులు చకిలేల మణిరాజ్, కుర్ర శ్రీనివాస్, ప్రదీప్ రెడ్డి, సంగీత రవి, జంపా, వినయ్, రాజు పాల్గొన్నారు.


పెద్దవంగర మండల కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

యువకుడి ఆత్మహత్యాయత్నం

మహబూబాబాద్ రూరల్, జూలై 4 : పురుగుల మందుతాగి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన పూరితండాలో గురువారం రాత్రి జరిగింది. ఎస్సై దీపికారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. తండాకు చెందిన కోర సందీప్ అనే యువకుడు డీజే సౌండ్ సిస్టమ్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటు న్నాడు. ఈ క్రమంలో రెండురోజుల క్రితం కంబాలపల్లికి చెందిన గణేష్, దిలీప్‌కు సంబంధిచిన డీజే మిక్షర్‌ను అపహరించాడని అనుమానంతో సందీప్‌ను సదరు వ్యక్తులు కంబాలపల్లి శివారు పెద్దచెరువు వద్దకు రహస్యంగా తీసుకువెళ్లి అతడిపై దాడీచేసి, చితకబాది వదిలేశారు. ఇంటికి వెళ్లిన సందీప్ తీవ్ర మనస్తాపంతో ఇంట్లో ఎవరూలేని సమయంలో ఇంట్లో నిల్వఉంచిన గడ్డిమం దును తాగాడు. గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దీపికారెడ్డి తెలిపారు.

బాలుడికి పాము కాటు

బయ్యారం, జూలై 4 : ఇంటి ఆరుబయట ఓ ఆరేళ్ల బాలుడిని పాము కాటేసిన ఘటన గురువారం రాత్రి చుంచుబందం తండాలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన అమీణ కుమారుడు ఆది ఇంట్లో నుంచి ఆరుబయటకు వెళ్లాడు. ఆ సమయంలో గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి చికిటిమయంగా మారింది. ఈ క్రమంలోనే చికట్లో పాము ఆదిని కాటేసింది. వెంటలే బాలుడు అరుపులు, కేకలకు కుటుంబసభ్యులు వచ్చి చూడగా పాము కాటేసినట్లు గమనించారు. దీంతో ఆ బాలుడిని చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు.

మానుకోటలో మహనీయుల జయంతి

మహబూబాబాద్ టౌన్, జూలై 4 : జిల్లా కేంద్రంలో నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం మహనీయులు జయంతి, వర్ధంతులను నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో మహనీయులు అల్లూరి సీతారామరాజు జయంతి, జాతీయజెండా రూపకర్త పింగళి వెంకయ్య వర్ధంతి, భారత ఆధ్యాత్మిక విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పిన స్వామివివేకానంద వర్ధంతులను నిర్వహించారు. మహనీయుల ఫ్లెక్సీలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదూరి కలాధర్‌రాజు, పొదిల ఐలయ్య, నేతాజీ సేవా సమితి అధ్యక్షుడు కందుల నాగరాజు, వివేక్, లక్ష్మీనారాయణ, వి.నాగేందర్, విశ్వనాథం, రోహిత్, శ్రీనివాస్, నవనీత్, రాంబాబు, సింధు, శోభన్‌బాబు, యాదగిరి, యశ్వంత్, ముఖేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

బాధితులకు అండగా భరోసా కేంద్రం

● ఏఎస్పీ జోగుల చెన్నయ్య

మహబూబాబాద్ రూరల్, జూలై 4 : లైంగిక దాడికి గురైన బాధితురాళ్లకు ఫిర్యాదు చేసినప్పటి నుంచి కేసు ట్రయల్‌కు వచ్చే వరకు, పరిహారం ఇప్పించే వరకు భరోసా అంటగా ఉంటుందని మహబూబాబాద్ జిల్లా ఏఎస్పీ జోగుల చెన్నయ్య అన్నారు. భరోసా సెంటర్‌లో గురువారం రికార్డు గదులు, కౌన్సిలింగ్ సెంటర్‌ను పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. ఎస్సై రమాదేవి, భరోసా సెంటర్ టీం సభ్యులు పాల్గొన్నారు.

14న జిల్లాస్థాయి నాయీ ప్రతిభా పురస్కారాలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 4 : జిల్లా కేంద్రంలోని గంగపుత్ర భవనంలో ఈనెల 14న జిల్లాస్థాయి నాయీ ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు నాయీ బ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (నోపా) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.కృష్ణప్రసాద్, కొలిపాక మల్లయ్య తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన సంఘ సమావేశంలో వారు మాట్లాడారు. 2023-24 విద్యాసంవత్సరం పదవ తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థినీ, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు నగదుతో పాటు సన్మానించనున్నట్లు తెలిపారు. ఇటీవల ప్రభుత్వ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పొందిన, మెడికల్ సీటు సాధించిన వారిని కూడా సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. పైఅర్హతలు ఉన్నవారు సెల్ నెంబర్ : 9676806774, 9866452112, 9347019203, 94900 90343, 9949742402లను ఈనెల 7వ తేదీలోగా సమాచారం అందించాలన్నారు.

‘మానుకోట నియోజకవర్గ అభివృద్ధికి కృషి’

మహబూబాబాద్ రూరల్, జూలై 4 : నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. గురువారం మహబూబాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ, ఎంపీటీసీల పదవీవిరమణ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం పదవీకాలం ముగిసిన ఎంపీపీ, ఎంపీటీసీలకు మెమోంటోలు అందించి, సత్కరించారు. మాజీ ఎంపీపీ భూక్య మౌనికసురేందర్, జడ్పీ సీఈవో నర్మద, జడ్పీ కోఆప్షన్ సభ్యులు షేక్.మహబూబ్‌పాషా, మాజీ వైస్ ఎంపీపీ ఎల్థి మల్లయ్య, ఎంపీడీవో రవికుమార్, ఏవో తిరుపతిరెడ్డి, రాజశేఖర్, ఎంపీవో హరిప్రసాద్, సూపరిండెంట్ రాధిక, మాజీ ఎంపీటీసీలు శ్రీపాల్‌రెడ్డి,రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విషాదం మిగిల్చిన పుట్టినరోజు వేడుక

(5వ పేజీ తరువాయి)

రామన్నగూడెం, ముంగిమడుగు గ్రామాల చెందిన ముగ్గురు గీతకార్మికుల వద్ద నుంచి 12సీసాల కల్లు తెప్పించుకుని ఆ కల్లును శ్రావణ్, ఎస్కే రహీంపాష, ఉపేంద్రాచారి తాగారు. కల్లుతాగిన ఆముగ్గురికి మరుసటి రోజు నుంచి తీవ్రజ్వరం, ఒళ్లునొప్పులు రాగా జూన్ 18న మానుకోటలోని ఓ ప్రైవేటు వైద్యుడిని సంప్రదించారు. రక్త పరీక్షలు చేయగా కామెర్లు వచ్చినట్టు నిర్ధారణైంది. ఆ డాక్టర్ మందులు ఇచ్చినప్పటికీ జ్వరం మరింత తీవ్రం కావడంతో వారు 26న ఖమ్మంలోని ఓ ప్రైవేటు హాస్పటల్‌కు వెళ్లి మరోసారి రక్త పరీక్షలు నిర్వహించగా, మిథైల్ ఆల్కహాల్ ప్రభావం లివర్, మూత్రపిండాలపై తీవ్రప్రభావం ఉందని అక్కడి వైద్యులు వెల్లడించారు. దీంతో కుటుంబసభ్యులు వారిని జూన్ 27న మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని వేర్వేరు ఆసుపత్రులకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్సపొందుతున్న ఆ ముగ్గురు యువకుల్లో బోగోజి శ్రావణ్ బుధవారం మధ్యాహ్నం, రహీంపాషా గురువారం తెల్లవారుజామున మృతిచెందారు. ఉపేంద్రాచారి ఆరోగ్య పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్టు ఎస్ఐ తెలిపారు. శ్రావణ్‌కు రెండేళ్ల వయస్సున్నప్పుడే తండ్రి ఈశ్వరయ్య మృతి చెందగా, అతడిని పెంచిపెద్దచేసిన తల్లి జయప్రద ఒంటరైంది. శ్రావణ్ అవివాహితుడు. ఇక రహీంపాషాకు రెండేళ్ల క్రితమే వివాహం కాగా తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉన్నారు. మృతుడు శ్రావణ్ తల్లి జయప్రద ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నామని ఎస్ఐసతీష్ వివరించారు. తమ గ్రామానికి చెందిన యువకులు కల్లుతాగి అస్వస్థతకుగురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందడం, మరొకరు ప్రాణపాయస్థితిలో ఉండడంతో రామన్నగూడెం వాసులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతులిద్దరూ అందరితో కలుపుగోలుగా ఉండేవారని, గ్రామంలో ఏదైనా అన్యాయం జరిగితే భయపడకుండా అవతలి వారిని ఎదిరించేవారని గుర్తుచేసుకుంటున్నారు.